# రెండో విడతకు లభించని మోక్షం



- గొర్రెలు ఎప్పుడిస్తారోనని ఎదురుచూపులు
- రెండో దశలో 3,612 మందికి మంజూరు
- ఇప్పటివరకు 369 యూనిట్లే గ్రౌండింగ్

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకం అమలు కాకపోవడంతో డీడీలు చెల్లించిన లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు. గొల్ల, కుర్మలకు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మలి విడత రాయితీ గొర్రెల పంపిణీకి మోక్షం లభించడం లేదు. సుమారు ఆరేళ్ల క్రితం మొదలు పెట్టిన ప్రక్రియ దాదాపుగా నిలిచిపోయింది. జిల్లాలో పలువురు లబ్ధిదారులు వాటాను చెల్లించినప్పటికీ సబ్సిడీ గొర్రెలను అందించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఒక వైపు గొర్రెలు అందక, మరోవైపు వాటాధనం కింద చెల్లించిన డీడీలు వాపసు ఇవ్వకపోవడంతో లబోదిబోమంటున్నారు. డీడీలు చెల్లించినవారికి యూనిట్లు అందకపోవడంతో మంజూరు పూర్తై వాటా ధనం చెల్లించని వారు సైతం వేచి చూస్తున్నారు. వాటా చెల్లించిన లబ్ధిదారులకు యూనిట్ల మంజూరులో జాప్యం జరగడంతో ఆందోళనతో గతంలో ప్రభుత్వంపై పలువురు బాధితులు ఒత్తిడి తీసుకొని వచ్చారు. దీంతో గత ప్రభుత్వం మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈలోగా ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ప్రభుత్వ పథకాలన్నీ నిలిచిపోయాయి. గొర్రెల పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు.

### జిల్లాలో తొలి విడత లిస్ట్ 'ఏ' పంపిణీ ఇలా...

గొల్ల, కురుమలను ఆదుకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 2017లో సబ్సిడీ గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టింది. 20 గొర్రెలు, ఒక పొటేలుతో కూడిన యూనిట్‌కు రూ. 1.25 లక్షల చొప్పున ధర నిర్ణయించింది. ఇందులో లబ్ధిదారుడు తన వాటా కింద రూ. 31,250 చెల్లిస్తే ప్రభుత్వం రూ. 93,750 చొప్పున సబ్సిడీ ఇస్తోంది. జిల్లాలో మొదటి విడతలో లిస్ట్ 'ఏ', లిస్ట్ 'బి'గా పంపిణీ చేయాలని నిర్ణయించిన అధికారులు మొదటి విడత లిస్ట్ 'ఏ' కింద 2017-18 లోనే దాదాపు లక్ష్యం మేరకు యూనిట్ల పంపిణీ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లాలో లిస్ట్ 'ఏ'లో 10,557 యూనిట్లు మంజూరు కాగా 9,762 యూనిట్ల పంపిణీ జరిపారు.

### మొదటి విడత లిస్ట్ 'బి' పంపిణీ ఇలా..

జిల్లాలో మొదటి విడత లిస్ట్ 'బి' కింద సబ్సిడీ గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని 2021 జనవరి 21న అప్పటి మంత్రి తలసాని యాదవ్ చేతుల మీదుగా ప్రారంభించారు. జిల్లాలో మొదటి విడత లిస్ట్ 'బి'లో 10,510 యూనిట్లు మంజూరు అయ్యాయి. ఇందులో ఇప్పటివరకు 7,686 యూనిట్ల పంపిణీ చేశారు. జిల్లాలో మిగిలిన 2,824 యూనిట్ల పంపిణీ చేయాల్సి ఉండగా వివిధ కారణాలతో నిలిచిపోయింది. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడం, కరోనా వ్యాప్తి, ఎన్నికలు తదితర కారణాల వల్ల పంపిణీలో జాప్యం చోటుచేసుకోంది.

### రెండో విడత మంజూరు ఇలా...

జిల్లా వ్యాప్తంగా రెండో విడత సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకం కింద 3,612 మంది లబ్ధిదారులను గుర్తించారు. ఇందులో జగిత్యాల నియోజకవర్గంలో 1,077, ధర్మపురిలో 1,339, కోరుట్లలో 564, చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని కొడిమ్యాల, మల్యాలలో 226, వేములవాడ నియోజకవర్గం పరిధిలోని మేడిపల్లి, కథలాపూర్, భీమారంలో 496 యూనిట్లు మంజూరయ్యాయి. జిల్లాలో రెండో విడతలో లబ్ధిపొందడానికి 1,580 మంది రైతులు వాటా ధనం డీడీ రూపంలో చెల్లించారు. రెండో విడతలో కేవలం 369 మంది లబ్ధిదారులకు యూనిట్లు పంపిణీ చేశారు. మిగిలిన 1,211 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉంది.

**విధి విధానాలు రావాల్సి ఉంది**

**కోటిచింతల వేణుగోపాల్ రావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి**

రాష్ట్రంలో ఏర్పడ్డ నూతన ప్రభుత్వం నుంచి ఇంకా విధి విధానాలు రాలేదు. వాటా చెల్లించిన లబ్ధిదారులు కొందరు నగదు వెనక్కి తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకంపై ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాము.

### రెండో విడతలో పెరిగిన యూనిట్ ధర..

ప్రభుత్వం సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకం కింద ఒక్కొక్కరికి 20 గొర్రెలు, ఒక్క పొట్టేలు చొప్పున అందించింది. వీటి యూనిట్ ధర రూ. 1,25,000 ఉండగా ఇందులో 75 శాతం ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రూ. 93,750 భరించగా లబ్ధిదారుడి వాటా కింద రూ. 13,250 చెల్లించారు. ఇందులో గొర్రెల యూనిట్‌తో పాటు రవాణా ఖర్చులు, బీమా, దానా కలుపుకొని ధరను నిర్ణయించారు. రెండో విడతలో యూనిట్ ధర 1,75,000గా పెరిగింది. ఈ లెక్కన లబ్ధిదారుడు 25 శాతం వాటా కింద రూ. 43,750 చెల్లించాల్సి ఉంటుంది. మిగితా 75 శాతం సబ్సిడీ రూ. 1,31,250 ప్రభుత్వం ఒక్కో యూనిట్‌కు చెల్లిస్తుంది. జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీ పథకంలో 3,619 యూనిట్లకు ప్రభుత్వ సబ్సిడీ రూపంలో సుమారు రూ. 47.49 కోట్లు భరించాల్సి ఉంటుంది. అయితే రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకాన్ని కొనసాగిస్తుందో.. లేదో తెలియక ఆందోళనకు గురవుతున్నారు.

## కట్టుదిట్టంగా పరీక్షల నిర్వహణ చేపట్టాలి

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి**



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఇతర అధికారులు

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో ఇంటర్, పదో తరగతి పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. హైద్రాబాద్ నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో సీఎస్ శాంతి కుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు శుక్రవారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీసీకి కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడారు. ఇంటర్, పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజా పాలన సేవా కేంద్రాల ఏర్పాటు కోసం అవసరమైన మేర డేటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించాలని సూచించారు. సేవా కేంద్రంలో అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్ ఇతర సామగ్రి సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా ఇంటర్ అధికారి నారాయణ, జడ్పీ సీఈవో గౌతం రెడ్డి, డిప్యూటీ సీఈవో రఘువరన్ పాల్గొన్నారు.

## శివరాత్రి ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు



కోటిలింగాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

వెల్గటూర్, మార్చి 1: మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటిలింగాలలో ఈ నెల 8న నిర్వహించే శివరాత్రి వేడుకల సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాట్లను శుక్రవారం తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి పరిశీలించారు. భక్తులు గోదావరి నదిలో ఇబ్బంది లేకుండా పుణ్య స్నానాలు ఆచరించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్నాన ఘట్టాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. మహిళలు బట్టలు మార్చుకునేలా గదులు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో వాహనాలపై వస్తారని వాహనదారులకు ఇబ్బంది కలుగకుండా పార్కింగ్ సౌకర్యం ఏర్పాట్లను పరిశీలించారు. వారి వెంట ఆలయ ఈవో కాంతారెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కరుణాకర్, అర్చకుడు నాగరాజుశర్మ, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## ఆర్‌ఎంపీ, పీఎంపీల సేవలు అభినందనీయం

**ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**



ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీలు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను జగిత్యాల రూరల్ మండలం, జగిత్యాల అర్బన్ మండలాలకు చెందిన ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఇటీవల నూతనంగా ఏర్పాటైన ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎమ్మెల్యే అభినందించారు. అసోసియేషన్ సంఘ భవనానికి సుమారు 10 గుంటల స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బుదరపు జ్ఞానేశ్వర్, గణేష్, మహేందర్, గోపి, మోహన్, రాజేశ్, రాజారాం, అబ్దుల్లా, భూమరాజం పాల్గొన్నారు.

## కాళేశ్వరంలో ఎమ్మెల్యే పూజలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వర-ము క్తేశ్వర స్వామిని శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్‌లు దర్శించుకున్నారు. ఆలయంలో పలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ప్రజాప్రతినిధులను అర్చకులు శేష వస్త్రాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, జడ్పీటీసీ సభ్యుడు నాగం భూమయ్య, కౌన్సిలర్ శివకేసరి బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వర్ రావు, నాయకులు సమిండ్ల శ్రీనివాస్, మహేందర్ పాల్గొన్నారు.



## 20 నుంచి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

ధర్మపురి, మార్చి 1: ధర్మపురి క్షేత్రంలో మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు (జాతరా) వైభవంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా యాత్రికుల సౌకర్యార్థం వివిధ శాఖల పక్షాన వసతుల ఏర్పాట్లు చేసేందుకు పాత టీటీడీ కళ్యాణ మండపంలో ఈ నెల 5న మంగళవారం ఉదయం 11 గంటలకు సమన్వయ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో చర్చకు వచ్చే వివిధ అంశాలపై చర్చించి 19 వరకు వసతుల ఏర్పాట్లు పూర్తి చేయాల్సి ఉంటుందని ఆమె వివరించారు. కావున జాతరా ఏర్పాట్లు విషయంలో విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని, సమావేశానికి సకాలంలో అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

## హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు

మల్యాల, మార్చి 1: హత్యాయత్నం కేసులో ఒకరికి ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తూ జగిత్యాల సెషన్స్ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరిచింది. మండలంలోని మ్యాడంపల్లికి చెందిన పిట్టల సుదర్శన్‌ను సమీప బంధువు పిట్టల రవి 2020 జూన్ 4న కత్తితో దాడి చేయడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ ఘటనపై సుదర్శన్ భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్తతో రవి తరచూ గొడవ పడుతుండే వాడని చేసిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై నాగరాజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. కాగ శుక్రవారం జగిత్యాల అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి కె.ప్రసాద్ రవికి ఏడేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.4వేల జరిమాన విధిస్తూ తీర్పు ఇచ్చారు.

## పల్స్ పోలియో విజయవంతం చేయాలి

మల్యాల, మార్చి 1: మండలంలో రేపు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి మౌనిక సిబ్బందికి సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమంపై శుక్రవారం వైద్య, అంగన్ వాడీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 0-5 సంవత్సరాల చిన్నారులకు ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు చుక్కలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మి, డీపీఎంవో దేవ్ సింగ్, రమేష్, నాగలక్ష్మి, సునంద, రమణమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు పాల్గొన్నారు.

## దుకాణంలో షార్ట్ సర్క్యూట్

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మైసమ్మ గడ్డ విద్యానగర్ బైపాస్ రోడ్డులో గల ఓ ఏజెన్సీ దుకాణంలో గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సంఘటనలో దుకాణంలోని పలు సామగ్రి దగ్ధమై సుమారు రూ. 5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు. సంఘటన స్థలానికి ఫైర్ స్టేషన్ సిబ్బంది చేరుకొని మంటలు ఆర్పడంతో నష్ట తీవ్రత తప్పింది. పోలీసు, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది సందర్శించి పరిశీలన జరిపారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్**



దివ్యాంగులకు సబ్సిడీ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మార్చి 1: దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో దివ్యాంగుల ఆర్థిక (ప్రత్యేక కోటా) పునరావాస పథకం కింద ఎంపికైన నియోజకవర్గ స్థాయి 89 మంది లబ్దిదారులకు సబ్సిడీ చెక్కులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. అలాగే మండలంలోని 120 మంది అర్హులైన లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఆర్థికంగా ముందు నిలబెట్టడం కోసం ప్రభుత్వం 81 మంది లబ్దిదారులను గుర్తించి రూ 50,000 చొప్పున సబ్సిడీ చెక్కులు అందించినట్లు తెలిపారు. ఇందులో మరో 8 మంది లబ్దిదారులకు రూ 1,00,000 చొప్పున సబ్సిడీ చెక్కులు అందించి చేయూత నిచ్చినట్లు ఆయన వివరించారు. దివ్యాంగులను ఆదుకునేందుకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. దివ్యాంగులు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుక వస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కల్యాణలక్ష్మి అనేది పేదింటి ఆడపడుచులకు ఒక వరమన్నారు. పేదరికంలో ఉన్న కుటుంబాలకు తమ కూతురు వివాహ సమయంలో కల్యాణలక్ష్మి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. కల్యాణలక్ష్మి పథకం కింద అర్హులైన లబ్దిదారులకు రూ 1,20,13,920 చెక్కులు అందించామని ఆయన తెలిపారు. కల్యాణలక్ష్మి కోసం దరఖాస్తులు చేసుకునే వారందరు దళారీలు ఆశ్రయించవద్దని ఆయన అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో నేరుగా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. లబ్దిదారులు దివ్యాంగుల సబ్సిడీ చెక్కులు, కల్యాణలక్ష్మి చెక్కులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల్లో ఇప్పటి వరకు నాలుగు హామీలను అమలు చేశామన్నారు. మరో రెండు హామీలను త్వరలో అమలు చేస్తామని ఆయన వివరించారు. పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించే విషయంలో రా జీ పడే ప్రసక్తే లేదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, జడ్పీటీసీ బత్తిని అరుణ, ఇంచార్జ్ డీడబ్ల్యువో శ్రీవాణి, డీపీవో దేవరాజం, మండల తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీవో రవీందర్, మున్సిపల్ కౌన్సిలర్లు వేముల నాగలక్ష్మి, జక్కు పద్మ, గరిగె అరుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కుసుమ, విజయలక్ష్మి, అండాళు, శైలజ, నీలిమ, లత పాల్గొన్నారు.

## కళాశాలలో వీడ్కోలు హంగామా

జగిత్యాలరూరల్, మార్చి 1 : జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం పూర్తి చేసుకున్న తోటి విద్యార్థినులకు ద్వితీయ సంవత్సర విద్యార్థినులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ వీడ్కోల సమావేశానికి ప్రిన్సిపల్ డాక్టర్ గోళి శ్రీలత హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ సమావేశాన్ని చూస్తుంటే తాము చదువుకున్న రోజులు గుర్తొస్తున్నాయని తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

డిగ్రీ కోర్సు జీవితంలో కీలకమని ఏ ఉద్యోగంలోనైనా, లేదా ఇష్టమైన రంగంలో స్థిరపడాలంటే డిగ్రీ తప్పనిసరి అన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొని ఎంతో ఉత్సాహంగా విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈకార్యక్రమంలో కల్చరల్ ఇన్‌చార్జి వేముల శరణ్య, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీలత

## దత్తత పేరుతో బాలుడిని విక్రయించిన తల్లి?

జగిత్యాలరూరల్, మార్చి 1 : జగిత్యాల రూరల్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో దత్తతపేరుతో బాలుడిని తల్లి విక్రయించిందని ఆ గ్రామంలో స్థానికులు చర్చించుకుంటున్నారు. ఓ వివాహిత తన భర్త నుంచి విడాకులు కావడంతో బాలుడితో కలిసి ఉంటోంది. కొన్ని రోజుల నుంచి తన కుమారుడి పై తరచూ దాడిచేయడంతో తల్లిపై గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల నుంచి బాలుడు తల్లి వద్ద కనిపించకపోవడంతో సదరు తల్లిని గ్రామస్థులు బాలుడు ఏమయ్యాడని ఆరా తీయగా బాలుడిని తమ దగ్గరివాళ్లకు దత్తత ఇచ్చానని పేర్కొనడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

## ఈద్గా మరమ్మతు పనులను పరిశీలించిన ఎమ్మెల్సీ



ఈద్గా మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 42వ వార్డులో గల ఈద్గా, కబరస్తాన్‌ల వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను శుక్రవారం ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి పరిశీలించారు. అభివృద్ధికి అవసరమైన పలు సలహాలు, సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, మాజీ చైర్మన్ నాగభూషణం, నాయకులు నేహల్, సదర్ బారీ, మీర్ ఖాజీమ్, మహిమూద్ పాల్గొన్నారు.

## ఆలయంలో దొంగతనం

మల్యాల, మార్చి 1: మండలంలోని రాజారం శివారులో గల ఎర్నాకులం రామాలయంలో శుక్రవారం దొంగతనం జరిగింది. ఆలయంలోని అర తులం బంగారు పుస్తెలు, వెండి ఆభరణలు శంఖం, బోగ చక్రం, 21 తమల ఆకులు, తదితర వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో ఆలయ పూజారి కిరణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సంఘటన స్థలంలో పోలీసులు వేలి ముద్రలు సేకరించారు.

# సివిల్ సప్లై అధికారుల సోదాలు

**అక్రమంగా సిలిండర్లను వినియోగిస్తున్న 21 మందిపై కేసు**



స్వాధీనం చేసుకున్న సిలిండర్లతో సివిల్ సప్లై శాఖ అధికారులు

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో గల హోటళ్లు, వాణిజ్య సంస్థల్లో సివిల్ సప్లయి శాఖ అధికారులు శుక్రవారం విస్తృతంగా సోదాలు నిర్వహించినట్లు జిల్లా సివిల్ సప్లయి అధికారి వెంకటేశ్వర్ రావు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ సిలెండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 21 మందిని గుర్తించి కేసులు నమోదు చేసినట్లు వివరించారు. వీరి వద్ద 36 డొమెస్టిక్ సిలెండర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సిలెండర్లను సమీపంలో గ్యాస్ ఏజన్సీలకు భద్రతా నిమిత్తం అప్పగించినట్లు పేర్కొన్నారు. ఇందులో జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండు పరిసర ప్రాంతాల్లో 13 సిలెండర్లను స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసులు నమోదు చేయగా, మల్యాల మండలం కొండగట్టు వద్ద, మల్యాల క్రాస్ రోడ్డు సమీపంలో 11 డొమెస్టిక్ సిలెండర్లను స్వాధీనం చేసుకొని 9 మందిపై కేసు నమోదు చేశామన్నారు. అదేవిధంగా మేడిపల్లి, మెట్‌పల్లిలలో 12 డొమెస్టిక్ సిలెండర్లను స్వాధీనం చేసుకొని 8 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. సబ్సిడీ సిలిండర్లను దుర్వినియోగం చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయి శాఖ నాయబ్ తహసీల్దార్లు, ఇన్స్‌పెక్టర్లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, మార్చి 1: కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కె నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం భగత్‌నగర్‌లో నిర్వహించిన దాడుల్లో 535 గ్రాముల గంజాయి పట్టుబడింది. గంజాయిని కలిగి ఉన్న ముగ్గురు నిందితులు శాంతినగర్‌కు చెందిన ఆర్ శశికుమార్, పెగడపల్లికి చెందిన పి రామకృష్ణ, వరంగల్‌కు చెందిన బి జయంత్‌పై కేసులు నమోదు చేసి అరెస్టు చేవామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. పట్టుబడి నిందితుల వద్ద నుంచి గంజాయితోపాటు రెండు మొబైల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి కేసుల్లో అనుమానితులుగా ఉన్న మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించగా వారిని బైండోవర్ చేశామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్లు కుమార్ యాదవ్, ఖాసీంబీ, కమలాకర్, కమాలుద్దీన్, సంతోష్ పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కార్యవర్గం

గణేశ్‌నగర్, మార్చి 1: తెలంగాణ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కార్యవర్గం శుక్రవారం హైదరాబాదులో ఏర్పాటైంది. అధ్యక్షుడిగా బొజ్జ సూర్యనారాయణ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా శ్రీధర్ రావు, పరమేష్, ఉపాధ్యక్షులుగా నారాయణ గౌడ్, రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శిగా యాద రామకృష్ణ, కోశాధికారిగా శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భాస్కర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పూర్వ అధ్యక్షులు ప్రకాష్, గింజల రమణారెడ్డి, సుందర్ రాజ్, కార్యదర్శులు హరిస్మరణరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ యాదా రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పెద్దపల్లి గాయత్రి కళాశాల కరస్పాండెంట్ యెల్లెంకి శ్రీనివాస్, తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల నిర్వహణ సభ్యులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదంలో చెరుకు పంట దగ్ధం

మెట్‌పల్లి రూరల్, మార్చి 1 : మండలంలోని సత్తక్కపల్లి గ్రామానికి చెందిన నల్ల విఠల్ అను చెరుకు రైతు పంట గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామం లోని నల్ల వెంకటేశ్వర్లు చెరుకు పంట వద్ద పనులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. రాత్రి సమయంలో చెరుకు పంటలో ఎగిసిపడుతున్న మంటలను గమనించిన స్థానికులు వెంటనే వెంకటేశ్వర్లుకు సమాచారం అందించారు. ఆయన వెంటనే అగ్ని మా పక సిబ్బందికి సమాచారం అందించి తోట వద్దకు వెళ్లాడు. మంటలను స్థానిక రైతులతో కలిసి ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి పంట పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో రూ. 2లక్షలు ఆస్థి నష్టం వాట్లిందని వెంకటేశ్వర్లు అవేదనతో తెలిపాడు. జరిగిన ప్రమాదంపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి ఎవరైనా అనుమాణితులు ఉంటే తెలపాలని సూచించారు. అగ్ని ప్రమాదం జరిగిందా ? ఎవరైనా కావాలని చేశారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

### - గన్నేరువరంవాసి మృతి

నార్సింగ్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కోకాపేట్ గుట్టపై మూవీ టవర్స్ వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. కరీంనగర్ జిల్లా గన్నేవరం గ్రామానికి చెందిన మునిగంటి కరుణాకర్ (45) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పని నిమిత్తం కోకాపేట్‌కు రాగా రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నార్సింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మల్యాల, మార్చి 1: కరీంనగర్- జగిత్యాల మార్గంలోని రాజారం సమీపంలో శుక్రవారం ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో తీవ్ర గాయాలతో ఒకరు మృతి చెందారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ర్యాలపల్లికి చెందిన తెట్టు ఎల్లయ్య(47) జగిత్యాల నుంచి స్వగ్రామానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో అతనికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.



బాబ్లీ ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు విడుదల అవుతున్న నీరు

# బాబ్లీ గేట్లు ఎత్తివేత

- దిగువ గోదావరిలోకి 0.6 టీఎంసీల నీటి విడుదల
- సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అధికారులు చర్యలు

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పొరుగున మహారాష్ట్రలో గల బాబ్లీ ప్రాజెక్టు గేట్లను శుక్రవారం అధికారులు తెరిచారు. ప్రాజెక్టు నుంచి 0.6 టీఎంసీల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం తాగునీటి అవసరాల నిమిత్తం ఒక రోజు పాటు నీటిని విడుదల చేస్తున్నారు. మహారాష్ట్రలో గోదావరి నదిపై బాబ్లీ ప్రాజెక్టు నిర్మిస్తున్న సమయంలో ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో పిటిషన్లు వేయడంతో సంబంధిత ఉత్తర్వులు వచ్చాయి. దీని ప్రకారం ప్రతీ సంవత్సరం జూలై 1వ తేది నుంచి అక్టోబరు 29వ తేదీ వరకు బాబ్లీ నుంచి అధికారులు నీటిని విడుదల చేస్తుంటారు. అదే విధంగా వేసవిలో ఎదురయ్యే నీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి మార్చి 1వ తేదీన ఒక రోజు పాటు నీటిని విడుదల చేస్తారు. ఈ మేరకు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఉదయం 9.30 గంటలకు 5 గేట్లను ఎత్తి నీటి విడుదలను ప్రారంభించారు. 0.6 టీఎంసీల నీరు విడుదల కాగానే తిరిగి గేట్లను మూసివేస్తారు. ఈ కార్యక్రమంలో పలువురు బాబ్లీ ప్రాజెక్టు, ఎస్సారెస్పీ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## 4న ఉమ్మడి జిల్లా జూనియర్స్ హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 1: ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా జూనియర్స్ బాలుర హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లాలోని కొత్తపల్లి మండల పరిధిలోగల అకాడమి హైట్స్ పబ్లిక్ పాఠశాల మైదానంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి పోటీలను నిర్వహిస్తామని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేష్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఈనెల 8 నుంచి 10 వరకు వరంగల్ జిల్లాలోని పైడిపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తిగల క్రీడాకారులు 01-01-2004 తరువాత జన్మించిన వారు సంబంధిత జనన ధ్రువీకరణ పత్రాలతో మైదానంలో పీఈటీ శ్రీధర్, జిల్లా సంఘం సంయుక్త కార్యదర్శి ఎన్ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్‌కు రిపోర్టు చేయాలని సూచించారు.

## 11న జేఎల్ఎం సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్, మార్చి 1: టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించే ఆరో విడత జూనియర్ లైన్‌మెన్(జేఎల్ఎం) సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలను 11న సోమవారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులకు వారి యొక్క చిరునామాలకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా కాల్ లెటర్లు పంపించామన్నారు. జాబితాను నోటీసు బోర్డులో కూడా ఉంచామన్నారు. కాల్ లెటర్ అందనివారు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో కాల్ లెటర్‌ను పొందవచ్చని తెలిపారు. జేఎల్ఎం నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, స్తంభం ఎక్కించడం పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలను నమ్మవద్దని కోరారు.

## 49మంది మందుబాబులకు జరిమానా

సిరిసిల్ల క్రైం, మార్చి 1: జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 49 మంది మందుబాబులకు జరిమానా విధిస్తూ శుక్రవారం సిరిసిల్ల ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సృజన తీర్పు ఇచ్చారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 20 రోజుల వ్యవధిలో నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన 33 మంది మందుబాబులను కోర్టులో హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ 8 మందికి రూ.2 వేల జరిమానా, 25 మందికి రూ.1000 జరిమానా విధించారని ఎస్సై రమాకాంత్ తెలిపారు. అదేవిధంగా కోనరావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 20 రోజుల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 16 మందిని కోర్టులో హాజరుపరచగా తొమ్మిది మందికి రూ .2 వేలు, ఏడుగురికి రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్సై వివరించారు.

## మూడు ద్విచక్రవాహనాలు దహనం



కాలిపోయిన వాహనాలు

తంగళ్లపల్లి, మార్చి 1: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలో ఇంటి ముందు నిలిపిన మూడు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టడంతో దహనమయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున గుగ్గిళ్ల అంజనేయులు ఇంటి ముందు మూడు ద్విచక్రవాహనాలు పార్క్ చేశారు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంల రామన్నపల్లెకు చెందిన గడ్డం సాయి ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టడంతో కాలిపోయాయి. ఇంటి ముందు రేకులు, షెట్లర్, పీవోపీకి సైతం పెట్రోల్ చల్లడంతో మంటలు చేలరేగి కాలిపోయాయి. సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడు గడ్డం సాయికృష్ణను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## యువకుడి ఆత్మహత్య

కోరుట్ల రూరల్, మార్చి 1: మండలంలోని జోగినిపల్లి గ్రామానికి చెందిన పలికొండ నవీన్ (31) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు శుక్రవారం ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నవీన్ తనకు పిల్లలు పుట్టడంలేదని కొంత కాలంగా మనస్తాపంతో ఉంటున్నాడు. దీంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని అత్మహత్య చేసుకున్నాడు. నవీన్ తండ్రి దేవయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

- రేవంత్‌కు, కేటీఆర్‌కు నక్కకు, నాగలోకానికి ఉన్న తేడా?
- కేటీఆర్‌కు దమ్ముంటే నిజామాబాద్ నుంచి పోటీ చేయాలి
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, మార్చి 1: ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా భవన్‌లో శుక్రవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కేటీఆర్ సీఎం రేవంత్‌ను పదవికి రాజీనామా చేసి పార్లమెంట్ బరిలో నిలవాలని సవాలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనం అన్నారు. కేటీఆర్‌కు, రేవంత్‌కు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందన్నారు. విమర్శించే ముందు ఆత్మవిమర్శ చేసుకొని మాట్లాడాలని హితవు పలికారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పరిస్థితి అధ్వానంగా మారిందని, కేటీఆర్ తీరుతో ఆఖరికి గెలుస్తదనే నమ్మకంతో ఉన్న మెదక్ సీటుకూడా గెలిచే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కేటీఆర్‌కు దమ్ముంటే కరీంనగర్, మెదక్, నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లలో పోటీ చేసి గెలవాలని జీవన్‌రెడ్డి సవాల్ విసిరారు. తుమ్మిడి హెట్టి వద్ద 160టీఎంసీల నీరు లభ్యత ఉందని నివేదిక ఉండగా, అక్కడి నుంచి ప్రాజెక్టు నిర్మాణంను కిందికి దించేందుకు మరో నివేదికను తయారుచేశారన్నారు. తుమ్మడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపడితే ఒక్క లిఫ్ట్‌తో ప్రాజెక్టుకు నీరు చేరేదన్నారు. మేడిగడ్డ పిల్లరు కుంగడం టెక్నికల్ లోపమని సమర్థించుకోవడం విచారకరం అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు ఓటేస్తే సంక్షేమ పథకాలు అందవని ప్రచారం చేశారని, ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చారని దుష్ప్రచారం చేశారని గుర్తుచేశారు. కానీ ప్రజా ఆశీర్వాదంతో ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీలను దశల వారీగ అమలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన తొలి గ్యారంటీ ఉచిత బస్సు సౌకర్యం నూటికి నూరు శాతం విజయవంతం అయ్యిందని, గృహవినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటును కూడా మార్చి ఒకటి నుంచి అమలు చేసిందన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వర్తిస్తుందని, దరఖాస్తు చేసుకోని, రేషన్‌కార్డు కలిగిన వారు స్థానిక మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.500కే సిలిండర్ కార్యక్రమం అమలుతో పాటు, గృహ నిర్మాణం పథకం కూడా వారం రోజుల్లో ప్రకటన వెలువడే అవకాశం ఉందన్నారు. ఇండ్ల పంపిణీలో పారదర్శకత పాటించేలా చర్యలు గైకొంటామన్నారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఇప్పటికైనా కేటీఆర్ స్థాయికి తగిన విధంగా మాట్లాడాలని హితవు పలికారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కొత్తమోహన్, గాజుల రాజేందర్, సిరాజుద్దీన్ మన్సూర్, షేక్ చాంద్‌పాషా, జున్ను రాజేందర్, బీరం రాజేష్, మహిపాల్, బొల్లి శేఖర్ తదితరులున్నారు.

● కాంగ్రెస్‌లో చేరికలు

జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ చెక్కపెల్లి మోహన్ రెడ్డి తో పాటు పలువురు నాయకులు టీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అలాగే సారంగాపూర్ మండలం పోచంపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ పల్లికొండ రమేష్‌తో పాటు పలువురు గంగపుత్ర సంఘ నాయకులు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా వీరికి కాంగ్రెస్ కండువా కప్పిన జీవన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.

## వైభవంగా సీతారామాంజనేయస్వామి ప్రతిష్ఠాపనోత్సవం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

మెట్‌పల్లి రూరల్, మార్చి 1: మండలంలోని బండ లింగాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్స వం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి ఆలయంలో పుణ్యాహవచనం గతస్థాపితార్చన, యంత్రమూర్తుల ప్రతిష్ఠాపన, నిత్యహోమం, జయాధి హో మం, ప్రాయశ్చిత్తహోమం, బలిహరణ, పూర్ణాహుతి, కుంభాషేకం ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలను పురోహితులు ఘనంగా జరిపారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల వారి కల్యాణం అంగరంగ వైభవంగా జ రిపించారు. మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణం తిలకించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, తదిత రులు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్న కారు

తిమ్మాపూర్, మార్చి1: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ వద్ద రాజీవ్ రహదారిపై శుక్రవారం ఉదయం మొక్కలకు నీరు పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను వెనకాల నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. కారులో బెలున్స్ తెరచుకోవడంతో అందులో ఉన్న వ్యక్తి ప్రమాదం నుంచి బయటపడాడు. కారులో మండలంలోని మహాత్మానగర్ గ్రామానికి చెందిన రాజేందర్ అనే వ్యక్తి ఉన్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

## ట్రాలీ ఆటో బోల్తా.. ఒకిరికి గాయాలు

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), మార్చి 1: సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట వస్తున్న ఆటో పదిర సమీపంలోని వంతెన ప్రధాన రహదారిపై ఉన్న గుంతలో పడి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. ప్రధాన రహదారిపై ఉన్న గుంతలో పడి ఆటో బోల్తా కొట్టింది. ట్రాలీ ఆటోలో తన కుమారుడితో ఎల్లారెడ్డిపేట వైపు వస్తున్న నారాయణపూర్ గ్రామానికి చెందిన మోతే దేవదాస్ గుంతలో పడి ఆటో బోల్తా పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు డ్రైవర్ పైఉన్న ఆటోను పక్కకు జరిపి 108లో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. వంతెనపై ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని వాహనదారులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చి ప్రమాదాలను నివారించాలన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, మార్చి 1: మండలంలోని చల్లూరు గ్రామ శివారు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మానకొండూరు మండ లం ఊటూరు గ్రామంలోని మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించామని, ఈ మేరకు కనుకుంట్ల శ్రీనివాస్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణ చేస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# సీజ్ చేసిన వాహనాలు వేలం వేస్తాం

- ప్రభుత్వానికి ఆదాయం కల్పించడమే ధ్యేయం
- డీటీసీ పెద్దింటి పురుషోత్తం



వాహనాల ఫిట్‌నెస్‌ను పరిశీలిస్తున్న డీటీసీ పెద్దింటి పురుషోత్తం

తిమ్మాపూర్, మార్చి1: రవాణా శాఖ కార్యాలయంలో ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసిన వాహనాలను వేలం వేసి ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూరుస్తామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా రవాణా శాఖ కమిషనర్ పెద్దింటి పురుషోత్తం అన్నారు. స్థానిక జిల్లా రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న డ్రైవింగ్ ట్రాక్ సమీపంలో ఉన్న పాడుబడ్డ వాహనాలను, వాహనాలను ఫిటెనెస్, రిజిస్ట్రేషన్ చేస్తున్న తీరును డీటీసీ పరిశీలించారు. ఈ సందర్భంగా సీజ్ చేసిన వాహనాల జాబితా తయారు చేసి వారం రోజుల్లోగా తనకు అందజేయాలని ఏఎంవీఐ స్రవంతిని ఆదేశించారు. కార్యాలయానికి ఫిటెనెస్, రిజిస్ట్రేషన్ కోసం వచ్చే భారీ వాహనాలు, ఆటోలకు నాణ్యమైనా రేడియం స్టిక్కర్లను ముందు, వెనుకాల కచ్చితంగా వేయించాలని వాహనదారులకు సూచించారు. స్టిక్కర్లు వేసుకోవడం వల్ల రాత్రి వేళల్లో ప్రమాదాలను నివారించవచ్చునని తెలిపారు. నిర్మాణం పూర్తయిన డ్రైవింగ్ ట్రాక్‌ను ప్రజలకు త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. డ్రైవింగ్ ట్రాక్ కు సంబంధించిన పెండింగ్ పనులపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి నిధులు సమకూర్చాలని కోరామని చెప్పారు. ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు సమకూర్చే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయిన వెంటనే పెండింగ్‌లో ఉన్న పనులను చేపట్టి రాష్ట్ర రవాణా శాఖ మంత్రిచేత ఈ డ్రైవింగ్ ట్రాక్‌ను ప్రారంభించే విధంగా చర్యలు చేపడుతామని డీటీసీ తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ రవికుమార్, ఏఎంవీఐ స్రవంతి, సిబ్బంది శ్రీనివాస్, రహూఫ్, గౌస్ పాష తదితరులు పాల్గొన్నారు.

# చురుగ్గా మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు

- చలువ పందిళ్లు సిద్ధం చేస్తున్న సిబ్బంది
- మూడు రోజుల పాటు నిర్వహణ



సిద్ధం చేస్తున్న పందిళ్లు

వేములవాడ, మార్చి 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 7వ తేదీ నుంచి మార్చి 9 వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాల కోసం ఆలయ అధికారులు భారీ స్థాయిలో ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలకు, వసతి గదుల కాంప్లెక్స్‌లకు కొత్తగా రంగులు వేయడంతో పాటు క్యూలైన్ల క్రమబద్ధీకరణ, విద్యుత్ దీపాలతో అలంకరణ, చలువ పందిళ్ల, కలకత్తా పందిళ్ల ఏర్పాటు, శివార్చన వేదిక నిర్మాణం, తాత్కాలిక పార్కింగ్ లాట్స్ ఏర్పాటు, యాత్రికులకు తాగునీటి వసతి కోసం నల్లాల ఏర్పాటు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు వంటి పనులు చురుగ్గా సాగుతున్నాయి. జాతర ప్రారంభం లోగా ఏర్పాట్లు పూర్తి చేస్తామని, జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని ఆలయ అధికారులు తెలిపారు.



రోడ్డు చదును చేస్తున్న సిబ్బంది

## భూ కబ్జాలకు పాల్పడిన వ్యక్తిపై కేసు

సిరిసిల్ల క్రైం, మార్చి 1: భూ కబ్జాలకు పాల్పడిన పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన సిరిగిరి రమేశ్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు వేముల వాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. వేములవాడ అర్బన్ పరిధిలోని తెట్టెకుంట పరిధిలో సర్వే నంబరు 6 లో గల 126 చదరపు గజాల స్థలాన్ని నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి, తనను బెదిరించి ఆక్రమించేందుకు ప్రయత్నిం చాడని బాధితుడు కరీంనగర్‌కు చెందిన బెంజిమెన్ ఫిర్యాదు మేరకు. కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు.

## 70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

సుల్తానాబాద్, మార్చి 1: అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న 70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. సుల్తానాబాద్ మండలంలోని దేవునిపల్లి గ్రామంలో రవాణాకు సిద్ధంగా ఉన్న రెండు వ్యాన్‌లలో లోడ్ చేయబడి ఉన్న సబ్సిడీ బియ్యంకు సంబంధించిన సమాచారాన్ని అందుకున్న పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణాకు సంబంధించి దేవునిపల్లి గ్రామానికి చెందిన వారణాసి సమ్మయ్య ను అదుపులోకి తీసుకుని రెండు వ్యాన్లలో ఉన్న బియ్యంతో పాటు సుల్తానాబాద్ పోలీసులకు అప్పగించామని పోలీసులు తెలిపారు.

## 7న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆత్మీయ సన్మానం



మాట్లాడుతున్న బీసీ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధి వైద్యుల అంజన్‌కుమార్

గణేశ్‌నగర్, మార్చి 1: బీసీ కుల గణన చేయాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి ప్రభాకర్‌కు మహాత్మ జ్యోతిబాపూలే ఆశయ సాధనకు బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన నిర్వహించే అభినందన సభ, ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ వైద్యుల అంజన్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఫిబ్రవరి 27న బీసీ కుల సంఘాల ఐక్య వేదిక ఏర్పాటు చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీసీ కులగణన చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అసెంబ్లీలో బీసీ కుల గణన తీర్మానం ప్రవేశ పెట్టారన్నారు. కృతజ్ఞతగా బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు ఈనెల 7వ తేదీన గురువారం కరీంనగర్‌లోని ఇంద్ర గార్డెన్స్‌లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. బీసీ నాయకులు, బీసీ సంఘాల నాయకులు, ప్రతినిధులు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్, బీసీ సంఘాల, కుల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సులో లైవ్ సర్జరీలు



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న వైద్యులు

సుభాష్‌నగర్, మార్చి 1: శాతవాహన న్యూరో డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సులో శుక్రవారం లైవ్ సర్జరీలను నిర్వహించారు. నగరంలోని రెనే ఆసుపత్రిలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సుకుమార్ సూర, డాక్టర్ మానస్ పాణిగ్రహి పాల్గొని అత్యాధునిక వైద్య విధానంతో మెదడులోని కంతిని తొలగించారని సదస్సు కమిటీ చైర్మన్ డాక్టర్ రమణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జొన్నల శ్రీనివాస్, సైంటిఫిక్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ పీవీకే కిషోర్ తెలిపారు. లైవ్‌లో వివరిస్తూ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారని చెప్పారు. ఈనెల 2న నగరంలోని వి కన్వెన్షన్‌లో సాయంత్రం ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

## సంతానసాఫల్య కేంద్రం డాక్టర్‌పై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, మార్చి 1: సంతానం కోసం వైద్య చికిత్సలు పొందేందుకు ఒక మహిళ కరీంనగర్‌లోని డాక్టర్ పద్మజ సంతాన సాఫల్య కేంద్రం ఆసుపత్రికి వెళితే డబ్బులు తీసుకుని చికిత్స అందించకుండా బెదిరించారని వచ్చిన ఫిర్యాదుతో డాక్టర్ పద్మజ సంతానసాఫల్య కేంద్రం డాక్టర్ పద్మజతోపాటు ఆసుపత్రి సిబ్బందిపై కేసు నమోదు చేశామని రెండో టౌన్ సీఐ ఓ వెంకటేష్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన తిరుమణి నాగలక్ష్మి అనే మహిళ సంతానం లేకపోవటంతో కరీంనగర్‌లోని డాక్టర్ పద్మజ సంతానసాఫల్య కేంద్రం ఆసుపత్రిలో సంప్రదించింది. సంతానం కలిగేందుకు చికిత్సకోసం డాక్టర్ పద్మజ, ఆసుపత్రి సిబ్బంది కలిసి ఆమె వద్ద ఐదు లక్షల రూపాయలు తీసుకున్నారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. చికిత్స అందించకుండానే మరో 80 వేల రూపాయలు చెల్లించాలని ఆసుపత్రి సిబ్బంది అడిగారని, చికిత్స చేయకుండా మళ్లీ డబ్బులు ఎలా ఇస్తామని అడగగా డాక్టర్‌తోపాటు సిబ్బంది తనను, తన భర్తను దూషించారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఆసుపత్రిలో బంధించి, చంపుతామని బెదిరించినట్లు ఫిర్యాదు చేసిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు డాక్టర్ పద్మజ, సిబ్బందిపై కేసు నమోదు చేవామని సీఐ ఓ వెంకటేష్ తెలిపారు.

## మార్టిగేజ్ చేసిన భూమి మరొకరికి విక్రయం

- మోసగించిన దంపతుల అరెస్టు - 14 రోజుల పాటు రిమాండ్



నిందితులను జైలుకు తరలిస్తున్న ఎస్సై

కరీంనగర్ క్రైం/గంగాధర, మార్చి 1: భూమిని మార్టిగేజ్ చేసి మరొకరికి విక్రయించిన దంపతులపై కేసు నమోదైంది. ఒక వ్యాపారి నుంచి 56 లక్షల రూపాయల డబ్బులు అప్పుగా తీసుకుని, హామీగా 3 ఎకరాల తొమ్మిదిన్నర గుంటల భూమిని మార్టిగేజ్ చేశారు. దంపతులు తిరిగి అదే భూమికి నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి మరొకరికి విక్రయించారు. ఈ మేరకు దంపతులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని గంధీరోడ్‌కు చెందిన సింగిరెడ్డి మోహన్‌రెడ్డి అనే వ్యాపారి వద్ద నుంచి గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌కు చెందిన మూల కనకయ్య 2016లో 30 లక్షల రూపాయలు, 2017లో మరో 26 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. హామీగా మాల కనకయ్య, అతని భార్య మాల మంజుల పేరిట ఉప్పర మల్యాలలో ఉన్న 3 ఎకరాల తొమ్మిదిన్నర గుంటల భూమిని మోహన్‌రెడ్డి పేరిట మార్టిగేజ్ చేశారు. రెండు బ్యాంక్ చెక్‌లను కూడా ఇచ్చారు. ఈ విషయాన్ని దాచిపెట్టి అదే భూమికి నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి ఇతర వ్యక్తులకు విక్రయించారని బాధితుడికి తెలిసి వారిని నిలదీశారు. దీంతో చంపుతానని బెదిరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గురువారం కేసు నమోదు చేసి, విచారణ జరిపిన గంగాధర పోలీసులు బాధితుడి ఫిర్యాదులో పేర్కొన్న విషయాలు నిజమేనని వెల్లడైంది. దీంతో దంపతులను శుక్రవారం అరెస్టు చేసి కరీంనగర్ కోర్టులో హాజరు పరిచారు. మేజిస్ట్రేట్ నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారని, కరీంనగర్ జిల్లా జైలుకు తరలించామని పోలీసులు తెలిపారు.

## అద్దకం కార్మికుడి అనుమానాస్పద మృతి

సిరిసిల్ల క్రైం, మార్చి 1: సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌లో నాగుల శ్రీకాంత్(36) అనే అద్దకం కార్మికుడు శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. టౌన్ సీఐ రఘుపతి వివరాల ప్రకారం... సుభాష్‌నగర్‌కు చెందిన శ్రీకాంత్ అద్దకం కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శ్రీకాంత్, లావణ్య దంపతులకు 14ఏళ్ల క్రితం వివాహమైంది. అతడికి భార్య లావణ్య, కుమారుడు, కూతురులు ఉన్నారు. భార్య, భర్తలిద్దరు ఇంట్లోనే ఉన్నారు. భార్య ఇంట్లో ముందు గదిలో బీడీలు చేస్తుండగా శ్రీకాంత్ బెడ్‌రూంలోకి వెళ్లాడని, ఏదో చప్పుడు వినిపించడంతో వెళ్లి చూడగా ఉరివేసుకొని ఉన్నట్లు చూసి వెంటనే చుట్టుపక్కల వారికి సమాచారం అందించి చికిత్స కోసం ఆస్పత్రికి తరలించామని భార్య లావణ్య చెబుతోంది. అప్పటికే శ్రీకాంత్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య, భర్తల మధ్య తరుచూ గొడవలుజరగుతున్నాయని, మద్యానికి బానిసైన శ్రీకాంత్ మృతిపై అనుమానాలు ఉన్నాయని శ్రీకాంత్ తల్లి సులోచన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

## పెళ్లి ఇష్టం లేక యువతి ఆత్మహత్య

కొడిమ్యాల, మార్చి 1: మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామానికి చెందిన కోల జమున(22)పెళ్లి ఇష్టం లేక శుక్రవారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు వివాహం చేయటానికి తల్లిదండ్రులు సంబంధాలు చూస్తున్నారు. వివాహం చేసుకోవటం ఇష్టం లేక జీవితంపై విసిగి పోయి ఇంటిలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే ఆమెను ఆమెను వేములవాడ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి తల్లి కోల భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చట్టాలపై ప్రతీఒక్కరికి అవగాహన ఉండాలి

### మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు




మెట్‌పల్లిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వరరావు

మెట్‌పల్లి, మార్చి 1: చట్టాలు, శిక్షలు అనే అంశంపై ప్రతి ఒక్కరి అవగాహన కలిగి ఉండాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు అన్నారు. పట్టణంలోని సుఖీభవ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు తయారు చేసిన చట్టాలు, శిక్షలు అనే కరపత్రాన్ని శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగినప్పుడే ప్రతీఒక్కరికి న్యాయం జరుగుతుందని, వాటి గురించి ప్రజలకు తెలిసే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం మంచి ఆలోచనని అభినందించారు. ఈ కార్యక్రమంలో సుఖీభవ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు బొక్కెనపెల్లి నాగరాజ్, మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్ సాధన సమితి అధ్యక్షుడు నాంపల్లి గట్టయ్య, దుర్గా గణేష్, గుణవర్ధన్ పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సంరక్షణ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### సీనియర్ సిటీజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్



మాట్లాడుతున్న హరి అశోక్ కుమార్

కోరుట్ల, మార్చి 1: సీనియర్ సిటిజన్స్ కోసం ఏర్పాటు చేసిన వయో వృద్ధుల సంరక్షణ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో ఏర్పాటు చేసిన సంరక్షణ చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల ఆయన మాట్లాడారు. నూతనంగా రాష్ట్రంలో వయోధికుల సంరక్షణ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులతో పాటు కోరుట్ల కాంగ్రెస్ నాయకులు జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావులకు కృతజ్ఞతలు తెలిపారు. పెన్షనర్ భవనానికి ప్రహరీ నిర్మాణానికి సహకారం అందిస్తున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘ సభ్యులు హన్మంత్‌రెడ్డి, గౌరిశెట్టి విశ్వనాథం, పబ్బా శివానందం, గంటేడి రాజ్‌మోహన్, చిలుక గంగారాం, బజ్జెల బుచ్చిరెడ్డి, బద్దినేని గోవర్ధన్ రావు, బురానొద్దిన్ పాల్గొన్నారు.

## మత్స్యశాఖ ఉద్యోగాల నియామకంపై విచారణ చేపట్టాలి

### జిల్లా డీఎఫ్‌సీఎస్ చీఫ్ ప్రమోటర్ పల్లికొండ ప్రవీణ్

మెట్‌పల్లి, మార్చి 1: రాష్ట్రంలో మత్స్యశాఖలో ఉద్యోగాల నియామకంపై సీబీఐ, సిట్టింగ్ జడ్జితో రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలని జిల్లా డీఎఫ్‌సీఎస్ చీఫ్ ప్రమోటర్ పల్లికొండ ప్రవీణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014 నుంచి 2024 వరకు మత్స్యశాఖలో ఉద్యోగాల నియామకంలో అవినీతి జరిగిందన్నారు. నియామకంలోని వివరాలను అడిగిన ప్రతిసారి నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్న డిప్యూటీ కమిషనర్ శంకర్‌రాథోడ్‌తో పాటు మత్స్యశాఖ పాత కమిషన్ అధికారుల పరిధిలో జరిగిన అవినీతి బయపడలంటే సీబీఐ, సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని కోరారు. జిల్లాలో రొయ్య పిల్లల అందించడంలో జిల్లా మత్స్యశాఖ అధికారి లోలం దామోదర్ అవినీతి పాల్పడి మత్స్యకారులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. చెరువులలో రొయ్యలు పొయకుండా బిల్లులు తీసుకుంటున్నరని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి జిల్లా మత్స్యశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, నర్సయ్య, మురళి, గంగాధర్, సాయి, పాల్గొన్నారు.

## మోడల్‌స్కూల్‌లో వాటర్‌ప్లాంట్ ప్రారంభం



కథలాపూర్‌లో వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న వికాస్‌దీప

కథలాపూర్, మార్చి 1: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో శుక్రవారం ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను డైరెక్టర్ చెన్నమనేని వికాస్‌దీప ప్రారంభించారు. సుమారు రూ. 2.5 లక్షల అంచనా వ్యయంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. తమ ఫౌండేషన్ ఇప్పటికే నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించేందుకు వివిధ రంగాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, గ్రామాల్లో, పల్లెల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్పోర్ట్స్ కిట్లు అందుబాటులో ఉంచడంతో పాటు టాయిలెట్స్ వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తాటికొండ నరేశ్, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, రాచమడుగు వెంకటేశ్వర్ రావు, మల్యాల మారుతి, కాశోజి ప్రతాప్, వినోద్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యాపార సంస్థలపై మున్సిపల్ అధికారుల దాడులు



దుకాణం యజమానికి జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల, మార్చి 1 : పట్టణంలోని వివిధ వ్యాపార సంస్థలపై శుక్రవారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. కిరాణం, ప్లాస్టిక్ ఏజెన్సీలు, హోటల్, బేకరీలపై దాడులు జరిపారు. నిల్వ ఉన్న ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తిరుపతి మాట్లాడారు. ప్రభుత్వం నిబదంనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ల ఆకు అంజయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.



# ఉపాధి సీనియర్‌మేట్లపై చిన్న చూపు

● ఆరేళ్లుగా నెరవేరని కల ● ఫీల్డ్ అసిస్టెంట్ ప్రమోషన్ల కోసం ఎదురుచూపు

కథలాపూర్, మార్చి 1 : ఉపాధి హామీ పనులను నిరంతరం కొనసాగిస్తూ కూలీలకు ఉపాధి కల్పించడంలో కీలకంగా వ్యవహరిస్తున్న సీనియర్‌మేట్లపై చిన్నచూపు ప్రదర్శిస్తున్నారు. వాస్తవానికి ఉపాధి హామీ పనులను పర్యవేక్షించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లది కాగా ఆ పోస్టులు ఖాళీ ఉన్న చోట సీనియర్ మేట్లతో పనులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం సీనియర్ మేట్లకు కూలీల మాదిరిగానే రోజు వారీ వేతనం వస్తుంది. ఆరు సంవత్సరాల కిందట అప్పటి ప్రభుత్వం వీరికి ప్రమోషన్లు ఇచ్చి ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించాలని ప్రతిపాదించింది. నేటికీ సీనియర్‌మేట్లుగానే కొనసాగుతుండడంతో నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నారు.

### ఏళ్ల కల నెరవేరని వైనం

ప్రస్తుతం మండలంలోని కలికోట, రాజారాంతండా, పెగ్గెర్ల, దుంపెట, దూలూరు, కథలాపూర్, పోసానిపేట గ్రామాల్లో సీనియర్‌మేట్లతోనే ఉపాధి పనులను అధికారులు చేపడుతున్నారు. పని ప్రదేశాల వద్ద కూలీలకు సదుపాయాలు కల్పించడంతో పాటు కొలతలు తీసుకుంటుంటారు. కూలీలతో హాజరు వేయించి మస్టర్లను అధికారులకు ప్రతీదినం పంపించాల్సి ఉంటుంది. అధికారులు నిర్వహించే సమావేశాలకు వెళ్తూ గ్రామాల్లో జరిగే పూర్తి స్థాయి సమాచారం అందిస్తున్నా శ్రమకు తగిన ఫలితం అందడం లేదనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ ఏటా మార్చిలో పనులు గుర్తించి ఏడాదిలో ఆ పనులు పూర్తి చేస్తుంటారు. ఫీల్డ్‌అసిస్టెంట్ చేసే పనులన్నీ చేస్తున్నప్పటికీ నామమాత్రంగా కూలీ మాత్రమే అందుకుంటున్నామని వాపోతున్నారు. సుమారు ఆరేళ్ల నుంచి ప్రమోషన్ ఇస్తారనే ఎదురు చూపులు ఫలించడం లేదు.

### ప్రమోషన్ కల్పించి ఆదుకోవాలి

#### అంబటి రాధాకృష్ణ, కలికోట



ఉపాధి పనులను పల్లెల్లో గుర్తించి ఆ పనులను పూర్తి చేసి అధికారు లతో సమన్వయం చేసుకుంటున్నా శ్రమకు తగిన ఫలితం రావడం లేదు. ఆరేళ్ల కిందట సీనియర్ మేట్‌గా పని చేస్తున్నప్పటికీ కేవలం కూలీ మాత్రమే చెల్లిస్తున్నారు. ప్రమోషన్ ఇస్తామని చెప్పడం వల్లనే సీనియర్‌మేట్‌గా పనులు చేస్తున్నాం. ఇప్పటికీ కల నెరవేరడం లేదు

### కొత్త ప్రభుత్వం కనికరించాలి

#### సంగీత, పోసానిపేట




ప్రస్తుతం ఫీల్డ్ అసిస్టెంట్ల మాదిరిగానే గ్రామాల్లో అన్ని రకాల పనులు చేస్తున్నాం. అయితే ఆ స్థాయిలో వేతనం అందక పోవడం వల్ల కుటుంబాల పోషణ కష్టతరంగా మారింది. ఎన్నోసార్లు గత ప్రభుత్వానికి విన్న పాలు చేసినా ఫలితం దక్కలేదు. కనీసం కొత్త ప్రభుత్వమైనా సీనియర్‌మేట్ల ఇబ్బందులను గుర్తించి ఫీల్డ్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇవ్వాలి.

# ఎల్‌ఎస్‌సీఎస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

● డైరెక్టర్లతో సమావేశం నిర్వహించిన డీసీవో ● ఫలితాలు సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు పంపిన అధికారులు

మెట్‌పల్లి రూరల్, మార్చి, 1 : మెట్‌పల్లి విశాల సహకార సంఘం చైర్మన్ తీగల లింగారెడ్డిపై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మాన సమావేశం డీసీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సహకార సంఘంలో ఉన్న 13 మంది డైరెక్టర్లలోని ఎనిమిది మంది డైరెక్టర్లు చైర్మన్‌పై ఫిబ్రవరి 12న జిల్లా కేంద్రంలో డీసీవో సత్యనారాయణకు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు మార్చి 1న బలనిరూపణ చేపట్టాలని డీసీవో నోటీసులు జారీ చేశారు. అయితే చైర్మన్ తీగల లింగారెడ్డి హైకోర్టును సంప్రదించడంతో రహస్యంగా బల నిరూపణ చేపట్టి ఫలితాలను హైకోర్టుకు అందజేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శుక్రవారం ఉదయం 11 గంటలకు డీసీవో సత్యనారాయణ సమావేశం ఏర్పాటు చేశారు. చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 13 మంది డైరెక్టర్లలో 9 మంది డైరెక్టర్లు సమావేశానికి హాజరు కావడంతో ఎన్నికల అధికారిగా వ్యవహరించిన డీసీవో హైకోర్టు ఆదేశాల మేరకు ఫొటో, వీడియో చిత్రీకరణతో డైరెక్టర్ల సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా డీసీవో మాట్లాడుతూ డైరెక్టర్లతో సేకరించిన సంతకాల పత్రాలను సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు అందజేస్తామన్నారు. ఇదిలా ఉండగా మెట్‌పల్లి విశాల సహకార సంఘంలోని కొంత మంది డైరెక్టర్ల అవినీతిని నిలదీసినందుకే తనపై అవిశ్వాస తీర్మానం పెట్టారని చైర్మన్ లింగారెడ్డి అన్నారు. సంఘంలో కొందరు డైరెక్టర్లు తీసుకున్న డబ్బులు కట్టాలని నోటీసులు ఇవ్వడంతోనే తనపై కక్ష కట్టారన్నారు.



డైరెక్టర్లుతో సంతకాలు సేకరిస్తున్న డీసీవో

## విద్యార్థులకు దుస్తుల పంపిణీ



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న యువకులు

కోరుట్ల రూరల్, మార్చి 1 : మండలంలోని సంగెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం గ్రామానికి చెందిన తీగెల మహేందర్‌రెడ్డి, ఆర్పీ రాజేందర్ స్కూల్ యూనిఫాంను పంపిణీ చేశారు. 40 మంది విద్యార్థులకు రూ. 40,000 విలువ గల స్కూల్ యూనిఫాంను పంపిణీ చేసి చేయూతన్ అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు రాంచదర్‌రావు, మహేందర్‌లతో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాపర్ వైర్ చోరీ

ధర్మపురి, మార్చి 1: ధర్మపురి మండలంలోని రాజారం, గాదెపల్లి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి పాల్పడ్డారు. వచ్చిన వ్యక్తులు ఆ రెండు గ్రామాల్లో వ్యవసాయ బావుల కరెంట్ మోటార్లకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి అందులో నుంచి కాపర్ వైరును చోరీకి పాల్పడటం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట పొలాలకు నీరందించే దశలో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురికావడం రైతులకు పెద్ద షాక్ తగిలినట్లు అయ్యింది. ఈ విషయమై సంబంధిత అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం అందింది.

## కార్మికులకు లేబర్ కార్డు అందించాలి

వేములవాడ, మార్చి 1 : భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ లేబర్ కార్డులు అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. శుక్రవారం సెంట్రింగ్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు లేబర్ కార్డులు అందించడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. లేబర్ కార్డులు రెన్యువల్ చేసుకునేందుకు వెళ్తున్న కార్మికుల వద్ద అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సెంట్రింగ్ యూనియన్ సంఘం అధ్యక్షుడు ఎల్లస్వామి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎల్ల రాజు, కోరెపు శ్రీనివాస్, డప్పు శ్రీనివాస్, దుమ్ము లక్ష్మణ్, శీలం రవి, లాల నర్సింగ్, వావిలాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారంలో ఉన్నప్పుడు గుర్తు లేదా ప్రోటోకాల్ ?

మెట్‌పల్లి జడ్పీటీసీ కాటిపల్లి రాధా

మెట్‌పల్లి, మార్చి 1: అధికారంలో ఉన్న సమయంలో గుర్తుకు రాని ప్రోటోకాల్ ఇప్పుడు ఏవిధంగా గుర్తుకొస్తోందని కోరుట్ల ఎమ్మెల్యేను జడ్పీటీసీ కాటిపల్లి రాధా-శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లా డుతూ అధికారంలో ఉన్న సమయంలో ప్రొటో కాల్ ప్రకారం జడ్పీటీసీని పిలవకుండా ఏ అధికారం లేకున్నా ప్రస్తుత ఎమ్మెల్యే అప్పుడు ప్రొసిడింగ్ పత్రాలను ఎలా అందజేశారో తెల పాలన్నారు. ప్రస్తుతం జువ్వాడి కృష్ణారావుపై ఆరోపణలు చేస్తూ విషయాన్ని పెద్దగా చూపుతూ అధికారులను బెదిరించడం సరికాదని, వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున నియోజక వర్గం ఇన్‌చార్జిలు అభివృద్ధి పనులకు వచ్చే అర్హత ఉందన్నారు. మరోసారి ఇటువంటి నీచమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన మీటింగ్‌లో ప్రోటోకాల్ గురించి ఎమ్మెల్యే మాట్లాడడం సిగ్గు చేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, కౌన్సిలర్ యామ రాజయ్య, నాయకులు ఎర్రోల హన్మండ్లు, పిప్పెర రాజేష్, పొట్ట ప్రేమ్, ఉల్లెందుల రమేష్, షేక్ మహ్మద్, షకీల్, పొన్నం తిరుపతి గౌడ్ పాల్గొన్నారు.

## ముగిసిన లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

బీర్‌పూర్, మార్చి 1: బీర్‌పూర్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జాతర బ్రహ్మోత్సవాలు గురువారం సాయంత్రం రథోత్సవం కార్యక్రమంలో ముగిశాయి. జాతర బ్రహ్మోత్సవాల అనంతరం చుట్టు పక్కల మండలాలలోని, భక్తులు, బీర్‌పూర్ మండల గ్రామాల ప్రజలు తరలి వచ్చిన భ క్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి గుట్ట కింద జతర జరుగు ప్రాంతానికి సమీపంలో వంటలు చేసుకొని భోజనాలు చేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా రథోత్సవం ముగియడంతో శుక్రవారం రాత్రి స్వామి వారికి ఏకాంతోత్సవ కార్యక్రమాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేకమైన మంత్రోత్సరణలు పటి స్టు వైభవంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేష్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ ఎనగంటి సామ్రాట్‌గౌడ్, అర్చకులు ఒద్దిపర్తి పెద్ద సంతోష్, మధు కుమార్, సంతోష్, సిబ్బంది రాజయ్య, వెంకటేష్, మల్లయ్య, ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయంలో ఆర్డీవో పూజలు



ఆర్డీవోకు జ్ఞాపిక అందిస్తున్న ఆలయ నిర్వాహకులు

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురానిపేటలో గల శ్రీలోకమాత పోచమ్మ ఆలయంలో శుక్రవారం జగిత్యాల ఆర్డీవో నర్సింహమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్డీవోకు ఆలయ అర్చకులు ఆశీర్వాదం, ప్రసాదం అందజేశారు. ఆలయానికి వచ్చిన ఆర్డీవోను ఆలయ కమిటీ సభ్యులు శాలువలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు రాజేందర్, హరికృష్ణ, రాజగోపా లచారి, గంగారాం, మల్లికార్జున్, చరణ్ పాల్గొన్నారు.

# మల్లికార్జున స్వామి ఆలయంలో విప్ పూజలు

ఎండపల్లి, మార్చి 1: భక్తులు కోరిన కోరికలు తీర్చే దేవుడు మారేడుపల్లి అంబటి మల్లిఖార్జున స్వామి అని, ప్రతి సంవత్సరం ఈ దేవుడిని పట్నాల సమయంలో ఖచ్చితంగా దర్శించుకుంటానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మండలంలోని మారేడుపల్లి గ్రామంలోని అంబటి మల్లికార్జున స్వామిని ఆయన శుక్రవారం నాడు దర్శించుకున్నారు. ఆయనకు ఒగ్గు డోలుతో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం జరిగిన స్వామి వారి పట్నం కార్యక్రమానికి అనివార్య కారణాల వల్ల హాజరు కాలేకపోయానని, అందుకే ఈ రోజు దర్శించుకున్నానని, ప్రతి సంవత్సరం దేవుడి వద్దకు వచ్చి మొక్కులు తీర్చుకుంటానని అన్నారు. ఇటీవలే జరిగిన ప్రమాదంలో స్వామి వారి దయతోనే బయట పడ్డానని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి మొదటి సారి గ్రామానికి రావడంతో గ్రామస్తులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఆలయ కమిటీ దేవస్థానం వద్ద ఉన్న బోర్ వెల్ ఊకే కూడుకుపోతుందని సమస్య చెప్పడంతో వెంటనే ఆయన బోర్ వారం రోజులలో వేపిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలోని పంట పొలాలకు త్వరలోనే నీటిని విడిపిస్తానని, రైతులు ఎవరు దిగులు చెందాల్సిన పనిలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తాటిపర్తి శైలెందర్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు బాలసాని మల్లేశం గౌడ్, గడ్డం లింగారెడ్డి, పల్లె అశోక్, అవుల తిరుపతి, సొంశెట్టి రమేష్, అల్లంల సురేష్ పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

## సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తా

### - కాంగ్రెస్ సినియర్ నాయకులు కృష్ణారావు

ఇబ్రహీంపట్నం, మార్చి 1:సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ సినియర్ నాయకులు జువ్వాడి కృష్ణరావు అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని వేములకుర్తి, మూలరాంపూర్ గ్రామలను సందర్శించారు. ఈ సందర్భంగా గంగానాల ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. సదార్మాట్ బ్యారేజీ నిర్మాణ పనుల సమయంలో గంగానాల ప్రాజెక్ట్ సంబంధించి కెనాల్ పూడిక పెరుకపోయిందని రైతులు సమస్యను వివరించి తమకు సాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. రైతుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి మహేందర్‌రెడ్డి, రాజరెడ్డి, తిరుపతి రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిశీలన

కథలాపూర్, మార్చి 1 : ప్రభుత్వం ధరణి పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయాని ఆదేశించిన నేపథ్యంలో శుక్రవారం తహసీల్దార్ ముంతాజీబోద్దీన్ సిబ్బందితో కలిసి పరిశీలన చేశారు. పెండింగ్‌లో ఉన్న 94 దరఖాస్తులను పరిశీలించి కలెక్టర్‌కు నివేదించామని చెప్పారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ నాగేశ్, జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు.

**కొడిమ్యాల:** మండల రెవెన్యూ కార్యాలయంలో స్పెషల్ డ్రైవ్‌లో బాగంగా శుక్రవారం ధరణి పెండింగ్ ఫైళ్లను తహసీల్దార్ రాజమణి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పరిశీలించారు. రెవెన్యూ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న 145 ధరణి ఫైళ్లను రెండు బృందాలుగా అధికారులు పరిశీలించారు. ఈ నెల 7 వరకు పరిశీలన ఉంటుందని తహసీల్దార్ తెలిపారు. ఈ పరిశీలనలో డిప్యూటీ తహసీల్దార్లు కృష్ణ, ప్రసాద్, ఆర్.ఐ. రవీందర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## వరి పొలాన్ని పరిశీలించిన ఏవో

కొడిమ్యాల, మార్చి 1 : కొడిమ్యాల గ్రామ శివారులోని వరి పొలాల నుశుక్రవారం ఏవో పి. జ్యోతి పరిశీలించారు. వరిని ఆశించిన మొగిపురుగు, అగ్గితెగులును గుర్తించారు. ప్రస్తుత్తం పీలక దశలో ఉన్నందున వాటిని నివారించాలని రైతులకు సూచించారు. నివారించకుంటే పంట దిగుబడి సరిగా రాదన్నారు. వాటి నివారణకు తీసుకోవాలిసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఏవో వెంట ఏఈవో మంజుల, పలువురు రైతులు ఉన్నారు.

## పసుపునకు కనీస మద్దతు ధర నిర్ణయించాలి

కొడిమ్యాల, మార్చి 1 : పసుపునకు కనీస మద్దతు ధర 15 వేల రూపాయలను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించాలని పూడూర్ మాజీ సర్పంచు వెల్మల రాంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సుమారు 10 ఏళ్ల నుంచి క్వింటాలు పసుపునకు 5 వేల రూపాయలు మించలేదన్నారు. ఇప్పటి వరకు నష్టపోయిన పసుపు రైతులు ప్రస్తుతం 14 వేల రూపాయలకు చేరటంతో ఊ రటచెందున్నారని పేర్కొన్నారు. పసుపు క్వింటాలుకు 15 వేల రూపాయలకు తగ్గకుండ కనీస మద్దతు ధరను నిర్ణయించి రైతులు నష్టపోకుండ చూడాలని కోరారు.

## ఘనంగా రాములోరి విగ్రహ శోభాయాత్ర

కోరుట్ల రూరల్, మార్చి 1 : మండలంలోని మాదాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా విగ్రహాల శోభాయాత్రను నిర్వహించారు. గ్రామ నుంచి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించగా మహిళలు మంగళ హారుతులతో స్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు ప్రత్యేక పూజలను నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పీటీసీ సభ్యురాలు దారిశెట్టి లావణ్య- రాజేష్ పాల్గొన్నారు.

## ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

కొడిమ్యాల, మార్చి 1 : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పూడూర్ గ్రామ శివారులో కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండ అక్రమంగా ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై అన్నారు.

## ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తాం

వేములవాడ, మార్చి 1 : శాసనసభ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని శుక్రవారం నాడు వివిధ కుల సంఘాలు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొని, కుల సంఘ భవన నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల మంజూరు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికలలో తన గెలుపు కోసం అందరూ కష్టపడి పని చేశారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీను నెరవేర్చే క్రమంలో నిధులను అందజేస్తున్నామని తెలిపారు. మీలో ఒకడిగా మీకు అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, కౌన్సిలర్ బింగి మహేష్, నాయకులు పల్కం రాజు, చిలక రమేష్, అన్నారం శ్రీనివాస్, పులి రాంబాబు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.